ఆ సార్లే మాకు కావాలి..

- గౌలిదొడ్డిలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల ధర్నా
- ప్రైవేటు టీచింగ్ ఫ్యాకల్టీని తొలగించి.. ఏడుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించిన అధికారులు



గౌలిదొడ్డి సంక్షేమ గురుకుల బాలికల కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థినులు

రాయదుర్గం/హాఫీజ్‌పేట్: ఆ సార్లే కావాలి.. వారు చెప్పే పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి.. వారిని పంపించొద్దు అంటూ ఉపాధ్యాయ దినోత్సవం రోజు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలురు, బాలికలు వేర్వేరుగా ధర్నా చేశారు. ఐఐటీ, నీట్ సిలబస్ బోధించడానికి ఇప్పటి వరకు కొనసాగిన పాత ఫ్యాకల్టీనే ఉంచాలని డిమాండ్ చేశారు. గురువారం గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర నీట్, ఐఐటీ కోచింగ్ సెంటర్ కళాశాల, బాలికల కళాశాల ప్రధాన గేటు ముందు విద్యార్థులు ఆందోళన చేశారు. తాత్కాలిక పద్ధతిన నియామకమైన అధ్యాపకులే కావాలని నినాదాలు చేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ గణేష్, శారద నచ్చజెప్పినా వారు ఒప్పుకోలేదు. సాంఘిక సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఈ కళాశాలల్లో 20 మంది ప్రైవేట్ టీచింగ్ ఫ్యాకల్టీతో నీట్, ఐఐటీ కోచింగ్‌కు ఏర్పాట్లు చేశారు. కానీ ఉన్నతాధికారులు ఈ విద్యాసంవత్సరం 20 మందిని తొలగించారు. వారి స్థానంలో కొత్తగా శాశ్వత ప్రాతిపదికన ఏడు మందిని నియమించారు. దీంతో రెండు రోజులుగా తాత్కాలిక అధ్యాపకులు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చేయడంతో సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సక్రూనాయక్ అక్కడకు చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు.



గౌలిదొడ్డి సంక్షేమ గురుకుల బాలుర కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

సోమవారం నిర్ణయం తీసుకుంటాం..

విద్యార్థులకు న్యాయం చేస్తామని, ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం అని సాంఘిక సంక్షేమ గురుకులాల జాయింట్ సెక్రటరీ సక్రూనాయక్ అన్నారు. ఈ విషయంపై సోమవారం నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన ప్రిన్సిపాల్స్ గణేష్, శారదలను కలిసి మాట్లాడారు.

పాత ఫ్యాకల్టీని కొనసాగించాలి



గురుకులాలల్లో పాత ఫ్యాకల్టీని కొనసాగించాలి. అకడమిక్ ఇయర్ మధ్యలో కొత్తవారిని నియమిస్తే ఇబ్బందులు వస్తాయి. సిలబస్, నీట్, ఐఐటీ పాఠాలు అర్థం కావు. మాకు న్యాయం చేయాలి

-రక్షిత్, విద్యార్థి

అనుభవం ఉన్నవారే కావాలి



ఇప్పటివరకు కోచింగ్ ఇచ్చిన అధ్యాపకులు అయితేనే మాకు న్యాయం జరుగుతుంది. విద్యాసంవత్సరం మధ్యలో పాత వారిని తొలగించడమేమిటి....? అనుభవం లేని కొత్తవారిని నియమించారు. దీంతో సమస్యలు వస్తాయి.

-హర్షవర్ధన్, విద్యార్థి

3 నెలల్లో మెయిన్స్..



పాత ఫ్యాకల్టీ తొలగింపు ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గత ఏడాది రెగ్యులర్‌లతో పాటు నీట్, ఐఐటీలో మంచి ఫలితాలు వచ్చాయి.మూడు నెలల్లో మెయిన్స్ పరీక్షలు ఉన్నాయి. కొత్తవారు ఎలా బోధిస్తారు...? దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

-బలరామ్, విద్యార్థి

తాగునీటి కనెక్షన్ ఇవ్వాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


సమస్యను పరిష్కరించాలని జీఎంతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: సీబీసీఐడీ కాలనీ నుంచి జంక్షన్ వరకు మంచి నీటి కనెక్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు ఆదేశించారు. కేపీహెచ్‌బీ డివిజన్, సీబీసీఐడీ కాలనీ వాసులు మంచినీటి సమస్యపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లోని బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. సరైన వైద్య సదుపాయాలు లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని, వైద్య సదుపాయాలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్‌రాయ్, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, సీబీసీఐడీ కాలనీ వాసులు పాల్గొన్నారు.


హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాన్ని జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. దీంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం ప్లకార్డ్స్ ప్రదర్శించారు. - కూకట్‌పల్లి

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు


వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- వరద నీటి కాలువ పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: వరద నీటి కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తొందరగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి రోడ్డులోని ఇండియన్ బ్యాంకు నుంచి ఎల్లమ్మ చెరువు అలుగు వరకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో వరద నీటి కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు, నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. అదే విధంగా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, కాంగ్రెస్ నాయకులు ఎర్రగడ్డ శ్రీనివాస్, జిల్లా గణేష్, కాశీనాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, రాజిరెడ్డి, విష్ణు, అర్జున్, ఇంతియాజ్, ధనుంజయ్, మదన్ కుమార్, శ్రీకాంత్, లక్ష్మణ్ కుమార్, సిద్ధార్థ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పంపిణీ చేయాలి


డీసీ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: మట్టి వినాయకులను పంపిణీ చేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్నెం కోటి రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ డీసీ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని కోరారు. ప్రతి ఇంటికి మట్టి విగ్రహాలను పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని డీసీని కోరినట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. మూడు రోజుల పాటు ప్రతి మండపానికి, ఇళ్లకు మట్టి వినాయకులను పంపిణీ చేస్తామన్నారు.


టీచర్స్ డే వేడుకల్లో పాల్గొన్న స్నేహ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ రాజు, ప్రిన్సిపాల్ మమత రాజ్ తదితరులు



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు, ఉపాధ్యాయులు


టీచర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా విచ్చేసి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బి. మాణిక్‌రెడ్డి, సూర్యనారాయణమూర్తి, కృష్ణయ్య, వెంకటేష్‌యాదవ్, కొండల్ రెడ్డి, మోహన్ రెడ్డి, బుచ్చిబాబు, వేణు, సంతోష్‌కుమార్, అశోక్, సునీల్, సత్యపాల్ రెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. రాధాకృష్ణన్ సేవలను స్మరించుకున్నారు.

పంచశీల పాఠశాలలో..

మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జెన్ నెక్స్ట్ పాఠశాలలో..

మోతీనగర్: సమాజంలో గురువుకున్న పాత్ర ఎనలేనిదని జెన్ నెక్స్ట్ పాఠశాల కరస్పాండెంట్ బి. శ్రీలత అన్నారు. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని జెన్ నెక్స్ట్ పాఠశాలలో టీచర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జితేంద్ర, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ మోడల్ స్కూల్‌లో..

కూకట్‌పల్లి: స్నేహ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. రాజు, ప్రిన్సిపాల్ ఎం. మమత రాజ్, శారద, ఉపాధ్యాయులు రేణుక, సాయి ప్రియ, వనజ, సోని, విద్యార్థులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో..

వివేకానందనగర్‌లోని భాష్యం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్‌ఈఓ శిరీష, ప్రిన్సిపాళ్లు శ్రీదేవి, యమున, సుధ హాజరయ్యారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు.

న్యూఎరా పాఠశాలలో..

వివేకానందనగర్ కాలనీలోని న్యూఎరా పాఠశాలలో విద్యార్థులు తమ గురువులకు శుభాకాంక్షలు తెలుపుతూ గ్రీటింగ్ కార్డులను అందించారు. 6,7 తరగతుల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులను సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు సుగుణను హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి అపర్ణ సన్మానించారు.


వేడుకల్లో పాల్గొన్న భాష్యం స్కూల్ ఉపాధ్యాయులు


న్యూఎరా పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


నివాళులర్పిస్తున్న సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి


సున్నం చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి భూమిని చదును చేయిస్తున్న అధికారులు


పర్వత్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపం


వి. రామారావు నగర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం

నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

వినాయక మండపాలను ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు

- మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని అవగాహన కల్పించిన అధికారులు, స్వచ్ఛంద సంస్థలు

మోతీనగర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆయా వినాయక మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని కొన్ని రోజుల నుంచి అధికారులు, ఆయా స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నాయి. అనేక మంది వినాయక మండపాల నిర్వాహకులు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి, భక్తి శ్రద్ధలతో పూజలు చేయనున్నారు. వారం రోజుల నుంచి వినాయక మండపాలు ఏర్పాటు చేయడానికి అల్లాపూర్ డివిజన్ పర్వత్ నగర్ చౌరస్తా, శ్రీ వివేకానంద నగర్ ఈటీం అండ్ వీ టీం, అదే విధంగా వివేకానందనగర్ సేవా సమితి, తులసీనగర్, గాయత్రినగర్, వి.రామారావు నగర్, ఆర్‌కే సొసైటీ, అల్లాపూర్, శివబస్తీ, సఫ్దర్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లతో పాటు పలు కాలనీల్లో, బస్తీల్లో వినాయక మండపాలను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ఇప్పటికే కొంత మంది మట్టి విగ్రహాలను తీసుకురాగా.. మరి కొంత మంది రంగుల విగ్రహాలను మండపాల వద్దకు తీసుకువచ్చారు. అల్లాపూర్ డివిజన్ సున్నం చెరువు వద్ద వినాయక నిమజ్జనాలకు జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ సిబ్బంది క్రేన్‌లు, జేసీబీల సాయంతో ఆ ప్రాంతాన్ని చదును చేస్తున్నారు. అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి పర్యవేక్షణలో నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.


మత్స్య అవతారంలో ఉన్న గణనాథుడు

నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఆల్విన్‌కాలనీ: వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేయాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద బీబీ పాండ్‌ను గురువారం కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం సజావుగా, సాంప్రదాయబద్ధంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద పకడ్బందీగా బారికేడ్‌లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఒక్కో పాయింట్ వద్ద రెండు పెద్ద క్రేన్లు, ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాండ్‌లో తగినంత నీరు ఉండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు నిరంజన్ గౌడ్, సురేష్, వాసు, హనుమంతరావు, నిఖిల్ పాల్గొన్నారు.


వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

మట్టి గణపతే.. మహా గణపతి


మట్టి వినాయకులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కూకట్‌పల్లి: కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ వి. ప్రశాంత్ కళాజాత బృందం ద్వారా మట్టి వినాయక విగ్రహాలపై గురువారం అవగాహన కల్పించారు. జేఎన్‌టీయూ బస్టాప్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి గణపతే.. మహా గణపతి అని, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉండే తాళ్ల రాజు(21), కె. అరుణ్ (20) గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా.. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి విక్రయించినట్లు అంగీకరించారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.